క్లుప్తంగా

రెండో విడత గొర్రెల పంపిణీ



చెన్నారావుపేట: మండలంలోని పాపయ్యపేటలో కురుమ కులస్తులకు మండల పశువైద్యాధికారి మంజీలాల్ గొర్రెలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సహకారంతో కురుమలకు రెండో విడత గొర్రెలను ఆరుగురికి పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల రవి, కుండె శ్రీశైలం, మిరపల వీరస్వామి, మహేందర్, ఎంపీటీసీ రమ, కేశవరెడ్డి, మీరాల మల్లయ్య, కట్టయ్య, కుమారస్వామి ఉన్నారు.

వల్మిడికి రావాలని గ్రామాల్లో ప్రచారం



రాయపర్తి: పాలకుర్తి మండలంలోని వల్మిడిలో సీతారామస్వామి ఆలయ ప్రతిష్ఠకు రావాలని కోరుతూ మండలంలోని పోతిరెడ్డిపల్లి, కాట్రపల్లి, వాంకుడోతుతండా గ్రామాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఆయా గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు కునుసోతు సరితసజ్జన్, బోనగిరి ఎల్లయ్య, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మహా ధర్నాలను విజయవంతం చేయాలి

నయీంనగర్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాల అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న జీడబ్ల్యూఎంసీ కార్యాలయం ఎదుట, 30న చలో హైదరాబాద్ మహా ధర్నాలను విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య పిలుపునిచ్చారు. డబ్బాల జంక్షన్, గోపాల్‌పూర్ జంక్షన్, రంగు బార్ జంక్షన్లలో ధర్నా కరపత్రాలతో గురువారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ జేఏసీ నాయకులు వేల్పుల ధర్మరాజు, సీఐటీయూ మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేష్, టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మున్నంగి రఘు, తదితరులు పాల్గొన్నారు.

గణపతి దీక్షల స్వీకరణ

కాజీపేట: కాజీపేట శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో పలువురు భక్తులు గణపతి దీక్షలను గురువారం స్వీకరించారు. ఆలయ వ్యవస్థాపకుడు, భద్రకాళి దేవస్థాన ఆస్థాన పండితుడు ఐనవోలు అనంత మల్లయ్యశర్మ సిద్ధాంతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు దీక్షా నియమాలను ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు శర్మ వివరించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ రవి, పీఆర్వో మణిదీప్, సుధీర్ తదితరులు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో మద్విఖనస జయంతి

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మద్విఖనస జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మద్విఖనస సేవా సమితి ఆధ్వర్యంలో విఖనస మహర్షి ప్రతిమకు పంచామృతాభిషేకం, విశేష అర్చనలు, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా సేవా సమితి కోశాధికారి డాక్టర్ అజిత్‌కుమార్ మాట్లాడుతూ అత్యంత ప్రాచీన చరిత్ర గల వైఖానస ఆగమ శాస్త్రాల అనుగుణంగానే ప్రపంచవ్యాప్తంగా అధ్యాత్మిక ఆరాధన కేంద్రాలు వెలిసినట్లు వివరించారు. కార్యక్రమంలో అర్చకులు వేదాంతం పార్థసారథి, సంపత్, స్థానికులు రాంబాబు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న స్మార్ట్ ఫోన్ అప్పగింత

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటకు చెందిన చిన్నారులు తమ నిజాయితీ చాటుకున్నారు. రాఖీ పౌర్ణమి కావడంతో ముగ్గురు స్నేహితులు ముత్తినేని సాయిచరణ్, వర్షిత్ సాయి, రామ్‌చరణ గురువారం ఉర్సు రోడ్డు వద్ద కలుసుకున్నారు. సరదాగా సైకిల్ మీద వెళ్తున్న క్రమంలో రోడ్డుపై వారికి స్మార్ట్ ఫోన్ కనిపించింది. అనంతరం ఆ మొబైల్ ఫోన్‌ను యజమానికి అందజేశారు.

చీఫ్‌విప్‌కు సన్మానం

కాశిబుగ్గ: హనుమకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ చీఫ్ విప్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌ను వరంగల్ లేబర్‌కాలనీకి చెందిన సాదీ ఎస్ఆర్‌ఐ మహమ్మద్ ఇర్ఫాన్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చీఫ్ విప్‌కు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా రాఖీ వేడుకలు

దుగ్గొండి: జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌కు రాఖీ కడుతున్న జెడ్పీ ఫ్లోర్ లీడర్ స్వప్న



చెన్నారావుపేటలో..



నర్సంపేట రూరల్‌లో..



చెన్నారావుపేట: ఎమ్మెల్యేకు రాఖీ కడుతున్న కల్పన



దుగ్గొండి: మండలంలోని పలు గ్రామాల్లో రాఖీ వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. అన్నా చెల్లెల అనుబంధానికి ప్రతీకగా నిలిచే పండుగ వేళ సుదూర ప్రాంతాలనుంచి తమ తోబుట్టువుల వద్దకు వచ్చి మహిళలు రాఖీలు కట్టారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్‌కు జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న దుగ్గొండిలోని ఆయన స్వగృహంలో రాఖీ కట్టారు. శ్రీనివాస్ సోదరీమణులు మహేశ్వరి, కవిత, అనిత రాఖీలు కట్టి అనుబంధాన్ని చాటుకున్నారు.

నర్సంపేట డివిజన్‌లో..

నర్సంపేట/నర్సంపేట రూరల్: నర్సంపేట డివిజన్‌లో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయమే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు, చిన్నారులు తన సోదరులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపి స్వీట్లను పంపిణీ చేశారు. నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి పలువురు బీఆర్ఎస్ మహిళా కార్యకర్తలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

చెన్నారావుపేట: మండలంలోని గ్రామాల్లో రక్షాబంధన్ వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే సోదరీమణులు సోదరుల ఇంటి బాట పట్టారు. రాఖీ కట్టి స్వీట్ తినిపించారు.

నెక్కొండలో..

నెక్కొండ: మండలంలో గురువారం శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని రాఖీ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. జంధ్యాల పౌర్ణమి సందర్భంగా పలువురు జంధ్యాలను పంచి, నూతన జంధ్యాలను ధరించారు.

సంగెం మండలంలో..

సంగెం: మండల కేంద్రంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం ఉదయం నుంచి చిన్నారులు, యువతులు, మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టి తీపితోపాటు ఆత్మీయానురాగాలను పంచుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు రాఖీలు కట్టడానికి ఒక ఊరి నుంచి మరొక ఊరికి ప్రయాణించేవారితో సందడి నెలకొంది.

ఘనంగా..

ఖానాపురం: మండల వ్యాప్తంగా ఘనంగా రాఖీ పండుగ వేడుకలను నిర్వహించారు. అన్ని గ్రామాల పరిధిలో తోబొట్టువులు తమ తమ అన్నయ్యల వద్దకు చేరుకోని రాఖీలు కట్టి ప్రేమానురాగాలను పంచుకున్నారు. దీంతో మండల వ్యాప్తంగా పండగ వాతావరణం సంతరించుకోంది.

ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో..

పర్వతగిరి: మండల వ్యాప్తంగా రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామాలు, మండలకేంద్రాల్లో కిరాణా షాపుల వద్ద కిటకిటలాడాయి. కాగా హనుమకొండలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు కేఆర్ నాగరాజుకు ఎంపీటీసీలు రాఖీలు కట్టారు. ఎంపీటీసీలు రేవతికుమార్, మహేంద్రకుమార్, సరోజన, కాంతమ్మ, సావిత్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.



సంగెం: తిమ్మాపురంలో..



చెన్నారావుపేట: రాఖీ కడుతున్న సోదరీమణులు



నెక్కొండ: రాఖీలను చూపుతున్న సోదరులు



ఖానాపురం: జెడ్పీటీసీకి రాఖీ కడుతున్న సోదరి



పర్వతగిరి: నాగరాజుకు రాఖీ కడుతున్న ఎంపీటీసీలు



నల్లబెల్లి : తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క



ఖానాపురం: రంగాపురంలో ..



రాయపర్తి: రాఖీ కడుతున్న అక్కాచెల్లెళ్లు

బీఆర్ఎస్‌లోకి మాజీ సర్పంచ్ దంపతులు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చల్లా

గీసుకొండ: మండలంలోని వంచనగిరి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు గూబల కవిత రమేశ్ దంపతులు పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో గురువారం జరిగిన కార్యక్రమంలో వారికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ కొల్లూరి రవీందర్, ఎలుకుర్తి సర్పంచ్ పూండ్రు జయపాల్‌రెడ్డి, కొంట్ర రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

బస్టాండ్ ఆవరణలో చెత్తను తొలగించాలి

నర్సంపేట : నర్సంపేట ఆర్టీసీ బస్టాండ్‌కు ప్రతిరోజు వందలాది మంది ప్రయాణికులు వచ్చి వెళ్తుంటారని పందులు స్వైర విహారం చేయకుండా ఉండేందుకు మున్సిపల్ సిబ్బంది చెత్తా చెదారాన్ని తీసుకెళ్లాలని నర్సంపేట డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మి అన్నారు. ఈమేరకు నర్సంపేట మున్సిపల్ కమిషనర్‌కు లిఖిత పూర్వకంగా విషయాన్ని తెలియజేశారు. నిత్యం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చెత్త పేరుకపోవడంతో ఈగలు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయని తెలిపారు. పందుల స్వైర విహారంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డీఎం మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేశారు.

జీవ నైపుణ్యాలే కీలకం

రామన్నపేట: 21వ శతాబ్దంలో జీవ నైపుణ్యాలే కీలకమని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ నవ నిర్మాణ్ కోచ్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ అన్నారు. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో యూ ఆర్ టాపర్స్ శిక్షణ కార్యక్రమంలో గురువారం పాల్గొని విద్యార్థులకు జీవ నైపుణ్యం అనే అంశంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు డొమైన్ విజ్ఞానంతో పాటు సాఫ్ట్ స్కిల్స్‌పై ప్రాధాన్యం పెంచుకోవాలని సూచించారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థుల్లో మార్పులు రావాలన్నారు. విద్యార్థులు తమ విలువైన సమయాన్ని అంతర్జాలంలో కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలతో గడపాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వర్ధన్నపేట: రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని బైక్ అతి వేగంగా వచ్చి ఢీ కొట్టడంతో గాయపడ్డాడు. గురువారం రాత్రి వర్ధన్నపేట పట్టణంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖిలా వరంగల్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గాదె రాజయ్య వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ సమీపంలో వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై రోడ్డును దాటుతున్న క్రమంలో రాయపర్తి మండల కేంద్రానికి చెందిన మచ్చ శ్రవణ్ కుమార్ తన పల్సర్ బైక్‌పై రాయపర్తి నుంచి వర్ధన్నపేట వైపుకు వస్తూ పోలీస్ స్టేషన్ సమీపంలో రోడు దాటుతున్న రాజయ్యను ఢీ కొట్టాడు. దీంతో రాజయ్య కాలికి గాయమై రక్తస్రావం అవుతుండడంతో పోలీసులు అంబులెన్స్‌లో రాజయ్యను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని శ్రవణ్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు.



రాజయ్యను అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది

అన్ని వర్గాల అభివృద్ధే బీజేపీ లక్ష్యం

నడికూడ: దేశంలోని అన్ని వర్గాలను అభివృద్ధి పథంలో నడిపించడమే బీజేపీ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. మండలంలోని వెంకటేశ్వరపల్లిలో బీజేపీ నేత డాక్టర్ కాళీప్రసాద్‌తో కలసి వెంకటేశ్వరస్వామి దేవాయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే బీఆర్ఎస్‌కు వేసినట్లేనని, కేసీఆర్ ప్రభుత్వం కేవలం హామీల ప్రభుత్వమేనని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అనంతరం బీజేపీ నేత డాక్టర్ కాళీప్రసాద్ మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు చెంచాలతో ఆస్తులు తవ్వుకుంటే, ప్రస్తుతం కేసీఆర్ ప్రభుత్వం జేసీబీలతో తెలంగాణ ఆస్తులను కొల్లగొడుతున్నారని అన్నారు. గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన 30 మంది నాయకులు పార్టీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. బీజేపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోగుల రాజిరెడ్డి, జయంత్‌లాల్, రాజవీరు, రాజకుమార్, సురేష్, రవీందర్, తిరుపతి, బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

ప్రయాణికులతో బస్‌స్టేషన్ కిటకిట

రాఖీ పౌర్ణమి సందర్భంగా వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రాంగణం ప్రయాణికులతో గురువారం కిటకిటలాడింది. బస్సుల కోసం ప్రయాణికులు ఎగబడ్డారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సు సర్వీసులు లేకపోవడంతో పలువురు గంటల తరబడి బస్‌స్టేషన్‌లో నిరీక్షించాల్సి వచ్చింది.

– వరంగల్ చౌరస్తా



ఫుట్‌పాత్‌లపై నిర్మాణాల తొలగింపు

వరంగల్ అర్బన్: కాజీపేట నిట్ నుంచి వడ్డేపల్లి వరకు ఫుట్‌పాత్‌లపై ఉన్న నిర్మాణాలను బల్దియా డీఆర్ఎఫ్ సిబ్బంది గురువారం తొలగించారు. చిరు వ్యాపారులు వ్యతిరేకించినప్పటికీ బలవంతంగా తీసివేశారు. గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశాల మేరకు స్మార్ట్‌సిటీ భాగంలో నగరంలో కూడళ్లు, రహదారుల సుందరీకరణ నేపథ్యంలో ఫుట్‌పాత్‌లపై ఉన్న డబ్బాలు, తోపుడు బండ్లను తొలగించారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేయకూడదని టౌన్ ప్లానింగ్ అధికారులు హెచ్చరించారు.



కాజీపేట నిట్ రోడ్డులో ఫుట్‌పాత్‌పై ఉన్న డబ్బాలను తొలగిస్తున్న బల్దియా డీఆర్ఎఫ్ సిబ్బంది

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని దాసరిపల్లిలో బీటీరోడ్డు మంజూరు చేయడంపై హర్షిస్తూ గ్రామ బీఆర్ఎస్‌నాయకులు ముఖ్యమంత్రి కేసీఆర్, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటాలకు పాలభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ కోమాండ్ల జయమ్మగోపాల్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ దాసరిపల్లి నుంచి బాంజీపేట గ్రామానికి రూ.70లక్షల బీటీ రోడ్డు మంజూరుచేశారని, ఈ రోడ్డు పనులు పూర్తయితే రెండు గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వలుగుబెల్లి విజయప్రతాప్‌రెడ్డి, గ్రామపార్టీ అధ్యక్షుడు వల్లాల కర్ణాకర్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

నల్లబెల్లి: దస్తగిరిపల్లి నుంచి నల్లబెల్లికి బీటీ రోడ్డు మంజూరు, కొండాయిల్‌పల్లి గ్రామంలో 100 శాతం సీసీ రోడ్లు నిర్మించడంకపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు ఎంపీపీ ఊడుగుల సునిత ఆధ్వర్యంలో మండలంలోని దస్తగిరిపల్లి, కొండాయిల్‌పల్లి గ్రామాల్లో గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. దస్తగిరిపల్లి నుంచి నల్లబెల్లి, జాతీయ రహదారి నుంచి అర్శనపల్లి, రంగాపుర్ నుంచి ముచ్చింపుల, లక్ష్మీతండా బీటీ రోడ్డు నుంచి రంగయ్య చెరువు, కొండాయిల్‌పల్లి నుంచి నారక్కపేట గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.5.55 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఊడుగుల ప్రవీణ్ గౌడ్, సర్పంచ్‌లు పెండ్యాల శ్రీలత, బొట్ల సువర్ణ, మామిండ్ల మోమన్ రెడ్డి, నాయకులు బాషబోయిన రాజు, కక్కెర్ల కృష్ణ, బొనగాని మోహన్, కొలగాని సదయ్య, కొనుకటి వీరమల్లు ఎద్దు రవి కుమార్, ఊరటి నరేష్, తాడెబోయిన విజయ్, కొనుకటి సాంబయ్య పాల్గొన్నారు.



దాసరిపల్లిలో పాలాభిషేకం చేస్తున్న జయమ్మ



క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ సునీత

11న చలో వరంగల్ కార్పొరేషన్

హన్మకొండ: మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సెప్టెంబర్ 11న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి, సీఐటీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, మున్సిపల్ జేఏసీ నాయకుడు వేల్పుల ధర్మరాజు హెచ్చరించారు. హనుమకొండ రాంనగర్, గోకుల్‌నగర్‌లలో మున్సిపల్ కార్మికుల హాజరు పాయింట్ల వద్ద కార్మికులను గురువారం కలిసి నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఖమ్మం, కరీంనగర్ మున్సిపాలిటీల్లో జవాన్లకు, డ్రైవర్లకు ఇస్తున్నట్లుగా వరంగల్ మహానగర పాలక సంస్థలో పనిచేస్తున్న వారికి కూడా నెలకు రూ.19 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇచ్చినట్లుగా ఇక్కడ కూడా మున్సిపల్ కార్మికులకు రూ.21 వేల కనీస వేతనం ఇవ్వాలని సూచించారు. పలు డిమాండ్ల అమలుకు 11న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముట్టడి, అనంతరం 30న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. బరుపట్ల మహేష్, రఘు, కార్మికులు పాల్గొన్నారు.

దుమ్ము లేస్తుంది..

చెన్నారావుపేట: మండలంలోని అమీనాబాద్, చెన్నారావుపేట, ఖాదర్‌పేట, జల్లీ గ్రామాల మీదుగా నర్సంపేటకు వెళ్లే ప్రధాన రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ కంకర పోసి వదిలేశారు. నీళ్లు కొట్టడం ఆపేసిన రోజు వాహనాలు వెళ్తున్న క్రమంలో దొమ్ము లేచి ఇంటిలో ఉండలేని పరిస్థితి నెలకొందని సమీపంలోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు నిర్లక్ష్యం చేయకుండా త్వరగా రోడ్డు పనులు ప్రారంభించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



అమీనాబాద్‌లో రోడ్డుపై పరిస్థితి

సామూహిక గాయత్రీ ధారణ

వరంగల్: పవిత్ర శ్రావణమాసంలోని జంధ్యాల పౌర్ణమిని పురస్కరించుకొని అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్ ఆధ్వర్యంలో పోచమ్మమైదాన్ జంక్షన్‌లోని సాయి బాబా ఆలయంలో సామూహిక గాయత్రీ ధారణను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి పద్మశాలీలు ప్రత్యేక పూజలు నిర్వహించి గాయత్రీ ధారణ ధరించారు. ఎల్‌బీనగర్‌లోని పద్మశాలీ పరపతి సహాయ సహకార సంఘంలో సామూహిక గ్రాయత్రీ పూజ నిర్వహించి నూతన జంధ్యాధారణ చేశారు. నాయకులు వడ్నాల నరేందర్, గోరంటల రాజు, శామంతుల శ్రీనివాస్, సూర్యనారాయణ, యెలుగం శ్రీనివాస్, బేతి అశోక్, సుధాకర్, నాగరాజు, ఎల్లయ్య, సారంగపాణి, రవి, రవీందర్, అవినాశ్, క్రాంతి, చిప్ప వెంకటేశ్వర్లు, రంజిత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ పౌర్ణమి పూజలు

కాశిబుగ్గ: శ్రావణమాసం రాఖీ పౌర్ణమి, జంధ్యాల పౌర్ణమిని పురస్కరించుకుని కాశిబుగ్గలోని పలు ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగనాథస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేశారు. మైసమ్మ దేవాలయంలో అభిషేకం నిర్వహించి మహా చండీహోమం నిర్వహించారు. పద్మనగర్ పద్మశాలి భవన్‌లో జంధ్యాల పౌర్ణమి పూజలు చేశారు. పూజా కార్యక్రమాల్లో కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, వంగరి రవి, అర్చకులు అరుట్ల కృష్ణమాచార్యులు, రామాచార్యులు పాల్గొన్నారు.



చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు